
# స్ట్రాంగ్ రూంలోకి ఎన్నికల సామగ్రి

- పిటిషన్ గడువు ముగిసే వరకూ భద్రత ఏర్పాట్లు
- వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

కాశీబుగ్గ, డిసెంబర్ 4 : ఎన్నికల సామగ్రికి పటిష్ట భద్రత కల్పించినట్లు వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. సోమవారం జిల్లా పరిధిలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌లతో పాటు ఎన్నికల సంబంధించిన పేపర్లు ఇతర సామగ్రిని కౌంటింగ్ ముగిసిన అనంతరం రిటర్నింగ్ అధికారుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని వేర్‌హౌస్ గోడౌన్ నంబర్ 17లో భద్రపరిచి, సీల్ వేసినట్లు ఆమె తెలిపారు. ఎన్నికల మెటీరియల్‌ను 45 రోజుల పాటు ఎన్నికల పిటిషన్ గడువు ముగిసే వరకూ పటిష్ట భద్రతతో నిత్యం పర్యవేక్షణలో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్వోలు అశ్విని తానాజీ వాకడే, షేక్ రిజ్వాన్ బాషా, కృష్ణవేణి, ఏఆర్వోలు నాగేశ్వర్‌రావు, విశ్వప్రసాద్ పాల్గొన్నారు.



ఎన్నికల సామగ్రి గోదాముకు సీల్ వేసిన కలెక్టర్ తదితరులు, (ఇన్‌సెట్‌లో) ఈవీఎంలను పరిశీలిస్తున్న ప్రావీణ్య


రాయపర్తిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## 'అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగించాలి'

రాయపర్తి, డిసెంబర్ 4 : పాలకుర్తి నియోజక వర్గవ్యాప్తంగా నిర్వహణలో ఉన్న అభివృద్ధి, సంక్షేమ పనులను కొత్త ఎమ్మెల్యే పూర్తి చేయించడంతోపాటు నియోజకవర్గ సమగ్రాభివృద్ధి చర్యలను నిరంతరం కొనసాగించాలని మండల బీఆర్ఎస్ నాయకులు, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు కాబోతున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి, నూతన ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. రాయపర్తి మండలంతోపాటు పాలకుర్తి ప్రజలందరి ఆకాంక్షలు, ఆశయాలకనుంగా నూతన పాలకులు పనులు చేయాలన్నారు. ఎన్నికల్లో ఎర్రబెల్లి దయాకర్ రావుకు ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు గుగులోత్ జాజునాయక్, అయిత రాంచందర్, కాంచనపల్లి వనజారాణి, కుందూరు రాంచంద్రారెడ్డి, యాదగిరిరెడ్డి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, చందు రామ్‌యాదవ్, ఉబ్బని సింహాద్రి, సంది వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసాద్

## ఘనంగా పోతన జయంతి

వరంగల్, డిసెంబర్ 4 : వరంగల్ ఏవీవీ కళాశాలలో పోతన జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పూర్వ ప్రిన్సిపాల్ పీఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ కలియుగ మానవుడు తరంచిపోవాలంటే భాగవతమే ఏకైక సాధనమన్నారు. సముద్రాల శఠగోపాలాచార్యులు మాట్లాడుతూ భాగవతాన్ని పఠించి జ్ఞానాన్ని ఆర్జించాలని విద్యార్థులకు సూచించారు. ఆరు దశాబ్దాలుగా పోతన భాగవత పద్య పఠన పోటీలు నిర్వహిస్తున్న ఏవీవీ విద్యాసంస్థలను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, కరస్పాండెంట్ చందా విజయ్‌కుమార్, శాశ్వత పాలక మండలి సభ్యుడు చందా శ్రీకాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# 'మల్లికాంబ'లో ఉచిత వైద్య శిబిరం


వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్న ప్రతిమ హాస్పిటల్ వైద్యులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 4 : అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా మల్లికాంబ మనోవికాస కేంద్రంలోని దివ్యాంగ చిన్నారులకు ప్రతిమ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రతిమ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ తిప్పని అవినాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లికాంబ ఆశ్రమంలో 15 ఏళ్ల నుంచి పిల్లలకు సేవ చేస్తున్న సిబ్బంది ఓదెమ్మకు క్యాన్సర్ వస్తే ఉచితంగా ప్రతి క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నుంచి సర్జరీ, మందులు అందించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు కూడా ప్రతిమ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. మల్లికాంబ సంస్థకు కూడా తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు గైనకాలజిస్టు డాక్టర్ సుమిత, డెర్మటాలజిస్టు డాక్టర్ రమేశ్, డెంటిస్టు డాక్టర్ ప్రియాంక వైద్య పరీలు నిర్వహించి, మందులు అందజేశారు. చిన్నారులకు దవాఖానలో ఉచిత వైద్య సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బండా రామలీల, ప్రొఫెసర్ పద్మ, కోడం కల్యాణ్ సిబ్బంది పాల్గొన్నారు.


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

## 'కోమటి కుంటను పరిరక్షించాలి'

వర్ధన్నపేట, డిసెంబర్ 4 : మండలంలోని ఇల్లంద శివారులో ఉన్న కోమటి కుంటలను పరిరక్షించాలని గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు సోమవారం అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి ఆనుకొని రహదారి పక్కనే ఉన్న కుంట కట్టను తొలగించి భూమిని విక్రయించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, దాన్ని వెంటనే నిలిపి వేయాలని కోరారు. దశాబ్దాల క్రితం ప్రజల అవసరాల కోసం పూర్వీకులు కుంటను నిర్మించినట్లు పేర్కొన్నారు. కానీ, కొంత మంది ఈ కుంట తమదేనని చెప్పి దళారుల సహకారంతో కట్టను తొలగించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# రోడ్డెక్కిన కేడీసీ విద్యార్థులు

**అదనపు ఫీజు వసూలు చేస్తున్నారని ఆందోళన**


కాలేజీ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 4 : యూనివర్సిటీ ఫీజులు పేరిట అదనంగా వసూలు చేస్తున్నారని కేడీసీ విద్యార్థులు రోడ్డెక్కారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(కేడీసీ)లో అదనపు ఫీజుల వసూలుకు నిరసనగా విద్యార్థులు సోమవారం కాలేజీ ఎదుట నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయాలంటూ రాస్తారోకో చేశారు. అదనంగా వసూలు చేస్తున్న యూనివర్సిటీ ఫీజులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న హనుమకొండ పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నాలు చేసినప్పటికీ వారు వినలేదు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ యూనివర్సిటీ ఫీజు పేరిట విద్యార్థుల నుంచి ఏటా అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కాగా, ప్రిన్సిపాల్ గాలి రాజారెడ్డి మాట్లాడుతూ ఏటా యూనివర్సిటీ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.450 నుంచి రూ.650 చెల్లించాల్సి ఉంటుందని, ఇది కట్టకపోతే యూనివర్సిటీ హాల్‌టికెట్ ఇవ్వదని, విద్యార్థులు చెల్లించిన ఫీజు రశీదుతో యూనివర్సిటీలో సంప్రదించాలని తెలిపారు. దీంతో విద్యార్థులు కేయూ రిజిస్ట్రార్‌ను కలువగా యూనివర్సిటీ రిజిస్ట్రేషన్ ఉంటుందని విద్యార్థులకు వివరించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.


జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు వీరే..

## జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఆర్‌డీఎఫ్ విద్యార్థులు

పర్వతగిరి, డిసెంబర్ 4 : జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు కల్లెడ ఆర్‌డీఎఫ్ విద్యార్థులు 13 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్ సోమవారం తెలిపారు. ఎస్‌జీఎఫ్ మహబూబాబాద్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహించగా మండలంలోని కల్లెడ ఆర్డీఎఫ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రికర్వ్ విభాగంలో ఆరుగురు, ఇండియన్ రౌండ్ విభాగంలో ఏడుగురు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ పోటీలు ఈ నెల 8 నుంచి 12 వరకు గుజరాత్‌లో జరుగుతాయని తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్ధన్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, ఆర్చరీ కోచ్ చందూలాల్, జయదాస్, ఏవో యాకాంబ్రం, ఉపాధ్యాయులు అభినందించారు.


ఎస్జీఎఫ్ క్రికెట్ టోర్నమెంట్‌కు వెళ్లే వరంగల్ జట్టుతో ఉదయభానురావు

## ఎస్జీఎఫ్ క్రికెట్ టోర్నమెంట్‌కు వరంగల్ జట్టు ఎంపిక

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 4 : గద్వాల్‌లో నిర్వహిస్తున్న అండర్–17 బాలుర ఎస్‌జీఎఫ్ క్రికెట్ టోర్నమెంట్ సెలక్షన్స్‌కు వరంగల్ జట్టు పాల్గొంటున్నట్లు వరంగల్ క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి ఉదయ్‌భానురావు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఆయన టీషర్ట్స్ అందజేసి వారికి ఎస్జీఎఫ్ తరఫున అభినందనలు తెలిపారు. ఈ టోర్నమెంట్ 5 నుంచి 8 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ సెక్రటరీ బొబ్బిలి వెంకట్‌రెడ్డి, ఎం కుమార్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కోదండపాణి, బండారి ప్రభాకర్, పీఈటీలు శంకర్, రఘు, సుమన్, సీనియర్ వాలీబాల్ ప్లేయర్ మర్రి ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.


పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సీఎంవో రాధ

# చర్లపల్లి పాఠశాలను సందర్శించిన సీఎంవో రాధ

నడికూడ, డిసెంబర్ 4: మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలను హనుమకొండ జిల్లా సీఎంవో( కమ్యూనికేషన్ మొబిలైజర్ ఆఫీసర్), ఐఈసీవో రాధ ఆకస్మికంగా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, స్కూల్‌లో ఉపాధ్యాయులు సరిపడా లేకపోవడంతో శ్రీ సాయి ట్రస్టు సాయంతో ఇద్దరు వలంటీర్లను ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఎం అచ్చ సుదర్శన్ వారికి తెలిపారు. దీంతో రాధ వలంటీర్లకు నెల జీతం రూ.6వేలు అందించారు. విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలంపల్లి విజేందర్, విద్య వలంటీర్లు బాబురావు, జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు సంధ్య, శ్రీ సాయి ట్రస్ట్ అధ్యక్షురాలు వేముల ప్రభావతి, ఐఆర్పీ రమేశ్ పాల్గొన్నారు.